# స్వర్లోకానలా తేనె సోనలా

—డాక్టర్ కరుణశ్రీ



## న భూతో నభవిష్యతి

శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై
చింతించెదన్ లోకర
క్షైకారంభకు, భక్తపాలన కళా
సంరంభకున్, దానవో
ద్రేక స్తంభకుఁ, గేళిలోల విలస
ద్దృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండ కుంభకు, మహా
నందాంగనా డింభకున్.

ఈ పద్యం బమ్మెర పోతన్నగారు ఆంధ్ర మహాభాగవతంలో మొదటి స్కంధంలో మొట్టమొదటగా శ్రీకారం చుట్టి రాశారు. భాగవతానికే కాదు—తెలుగు సాహిత్య సరస్వతికే మకుటాయమానమైన పద్య మిది.

అక్షరమైన మోక్ష సంపదను అపేక్షించిన పోతన్నగారు ఆనంద స్వరూపిణి అయిన ఆనందగోపుని ఇల్లాలి ఒడిలో అల్లారుముద్దుగా ఆడుకొంటున్న అందాల బాలుణ్ణి ధ్యానిస్తున్నారు. ఆ యశోదాకిశోరుడు సామాన్యుడు కాడు. ఏమాత్రం ఏమరుపాటు లేకుండా ఎల్లలోకాలనూ చల్లగా పాలిస్తూ ఉంటాడు. ప్రసన్నులైన భక్తుల ప్రార్థనలను ఆలిస్తూ లాలిస్తూ ఉంటాడు. నిరంకుశులైన నిశాచరుల ఔద్ధత్యాన్ని నిర్మూలిస్తూ ఉంటాడు. అంతేకాదు. కన్నతల్లి ఒడిలో ఒయ్యారంగా కూర్చున్న ఆ చిన్నికన్నయ్య ఒక్కసారి అలా కన్నులెత్తి చూస్తే చాలు. ఎన్నెన్నో బ్రహ్మాండ భాండాలు తండోపతండాలుగా ఆ చూపుల్లో రూపులు దిద్దుకుంటాయిట!

ఇష్ట దేవతాస్తుతీ, వస్తు నిర్దేశమూ ఉన్న ఈ మనోజ్ఞవృత్తం మహాభాగవతంలోని ఇతివృత్తాని కంతటికీ అద్దం పడుతుంది. ఈ పద్యంలో ఆరు దళాలు ఉన్నాయి—1. శ్రీ కైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్ 2. లోక రక్షైకారంభకున్ 3. భక్తపాలన కళా సంరంభకున్ 4. దానవోద్రేక స్తంభకున్ 5. కేళిలోల విలసద్దృగ్జాల సంభూత నానా కంజాత భవాండకుంభకున్ 6. మహానందాంగనా డింభకున్ అనేవి.

భగవంతుని అనంత కల్యాణ గుణాలలో ప్రధాన గుణాలైన సర్వేశ్వరత్వం, ధర్మ సంస్థాపకత్వం, శిష్టరక్షణ పరాయణత్వం, దుష్టశిక్షణ చణత్వం, విశ్వకర్తృకత్వం, ఆనందమయత్వం—అనేవి ఆరూ క్రమంగా పై ఆరు దళాలలోనూ ప్రస్ఫురిస్తున్నాయి.

'శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్' అన్న ప్రథమ దళంలో ముని శాపోపహతుడై మోక్షం కోసం ఉత్కంఠితుడైన పరీక్షిత్తు వృత్తాంతంతో పాటు మొత్తం భాగవతమే ధ్వనిస్తున్నది. ప్రథమ స్కంధంలోని నారదుడు, భీష్ముడు, కుంతీదేవి మొదలైన వారి కథలూ—తృతీయ స్కంధంలోని దేవహూతి వృత్తాంతమూ—చతుర్థ స్కంధంలోని ధ్రువ చరిత్రా స్ఫురిస్తూ భగవంతుని 'సర్వేశ్వరత్వాన్ని' నిరూపిస్తున్నాయి. ఎందుకంటే కైవల్యాన్ని అనుగ్రహించే అధికారం ఒక్క సర్వేశ్వరునికి మాత్రమే ఉంటుంది.

'లోకరక్షైకారంభకున్' అన్న ద్వితీయ దళంవల్ల వరాహ నృసింహ రూపాలు ధరించి హిరణ్యాక్ష హిరణ్యకశిపులను సంహరించి, వారి అత్యాచారాలవల్ల అస్తవ్యస్తమైన భూదేవిని ఉద్ధరించిన భగవంతుని 'ధర్మ సంస్థాపకత్వం' స్థాపించబడింది.

భక్తులను పాలించటం ఒక కళ. 'భక్తపాలన కళా సంరంభకున్' అనే తృతీయ దళంవల్ల గజేంద్రుణ్ణి కాపాడటానికి మహావిష్ణువు వైకుంఠం నుంచి పరుగెత్తుకు వచ్చిన వృత్తాంతమూ, దుర్వాసుని బారినుంచి అంబరీషుణ్ణి కాపాడిన వృత్తాంతమూ, పలు బాధలకు లోనైన ప్రహ్లాదుణ్ణి రక్షించిన విధమూ ధ్వనిస్తూ భగవంతుని 'శిష్టరక్షణ పరాయణత్వాన్ని' చాటుతున్నవి.

'దానవోద్రేకస్తంభకున్'—అన్న చతుర్థదళంవల్ల అష్టమ స్కంధంలోని వామనావతారం వ్యంజితమయింది. తరువాతి మన్వంతరంలో ఇంద్రుడు కావలసిన బలిచక్రవర్తి వరబలంతో ముందుగానే స్వర్గాన్ని ఆక్రమించి ఇంద్రపదం కాంక్షించాడు. ఆ దానవేంద్రుని ఉద్రేకానికి పగ్గాలు పట్టి స్తంభింపజేయటం కోసం స్వామి వామనుడై తన 'దుష్టశిక్షణ చణత్వాన్ని' ప్రకటించాడు.

'కేళిలోల...కుంభకున్'—అనే పంచమ దళంవల్ల భగవంతుని 'విశ్వకర్తృకత్వాన్ని' వెల్లడించే సూర్య, చంద్రవంశాల చరిత్ర నవమ స్కంధంలోది స్ఫురిస్తుంది. నిజానికి స్వామి కళ్ళు సూర్యచంద్రులేగా!

'మహానందాంగనా డింభకున్'—అన్న షష్ఠదళం కృష్ణలీలా సర్వస్వమైన దశమ స్కంధానికి ప్రతీక. ఆ నందాంగనకు ఆనందం అందిస్తూ ఆనందం అనుభవిస్తున్న ఆనందమయుడు ఆ నందనందనుడు.

ఈ విధంగా భాగవతంలోని కథ లన్నింటినీ ధ్వనింపజేస్తున్న ఈ పద్యం బమ్మెర పోతన్నగారి ప్రతిభకు చక్కని ఉదాహరణం. ఆంధ్ర సాహిత్యంలో ఇంతటి హృద్యమైన పద్యం న భూతో న భవిష్యతి. ●

---

మినీ కథ

# పొరపాటు

రమణమూర్తీ, సుందర్రావూ మంచి స్నేహితులు. ఒకరు పేరు మోసిన డాక్టరు హైదరాబాదులో. మరొకరు ఏదో కంపెనీలో ఇంజనీర్.

చాలాకాలం తరువాత వాళ్ళు అనుకోకుండా వైజాగ్‌లో కలుసుకున్నారు. చాలా చాలా మాట్లాడుకున్నారు. హోటల్ కెళ్ళి భోంచేశారు. మేటినీ చూశారు. సాయంకాలం రామకృష్ణా బీచ్ కొచ్చేశారు. అక్కడ ఎగిరిపడే అలలను చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

నిజానికి ఇద్దరూ ఎప్పుడూ బిజీగా ఉండేవాళ్ళే. అదృష్టంకొద్దీ వాళ్ళ కామాత్రం తీరిక దొరికిందని చెప్పవచ్చు.

"నువ్వు నీ వృత్తిలో ఎప్పుడైనా పొరపాటు చేశావా?" అనడిగాడు రమణమూర్తి మాటల మధ్యలో.

"ఎప్పుడో కూడా బాగా గుర్తుండిపోయింది. ఒక్కసారి 1980లో. ఉగాది రోజున..."

"ఏమి టా పొరపాటు?"

"ఒక ఆపరేషన్, అఫ్‌కోర్స్, చిన్నదే అనుకో... వంద రూపాయలు ఛార్జ్ చేశాను."

"ఇందులో పొరపాటేముందీ?"

"పొరపాటు కాదూ—అతనేమీ లేనివాడనుకున్నాను. ఆ తరువాత అతని దగ్గర ఆ సమయంలోనే వెయ్యి రూపాయలు ఉన్నట్టు తెలిసింది. బాధపడడం కంటే ఏం చేయలేకపోయాను!" అని జవాబిచ్చాడు డాక్టరు. ఇంజనీరు తెల్లమొహంవేశాడు.

—మంత్రవాది మహేశ్వర్